ముమ్మరంగా పొగాకు నారుమడుల పెంపకం

- ఏజెన్సీ మెట్టప్రాంతాల్లో 20 హెక్టార్లలో నర్సరీలు
- దసరా తర్వాత నుంచి నాట్లకు సన్నాహాలు
- ట్రే నర్సరీలపై రైతుల ఆసక్తి

బుట్టాయగూడెం: పొగాకు పంట సీజన్ రానే వచ్చింది. ఏజెన్సీమెట్ట ప్రాంతంలో పంటసాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు రైతులు నారుమడుల పెంపకంలో బిజీగా ఉన్నారు. దసరా తర్వాత నాట్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఏజెన్సీ మెట్ట ప్రాంతంలోని జంగారెడ్డిగూడెం–1, –2 వేలం కేంద్రాల పరిధిలో సుమారు 6500 మందికి పైగా రైతులు పొగాకు పంట పండిస్తుంటారు. ఈ ప్రాంతంలోని భూములు పొగాకు పంటకు అనుకూలమైనవి. ఈ ఏడాది ప్రారంభంలో కాస్త పొగాకు పంట ధర నిరాశపరచినప్పటికీ ప్రస్తుతం రికార్డు స్థాయిలో ధర పలకడంతో పొగాకు సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.


కొమ్ముగూడెంలో నారుమడులు పెంచుతున్న దృశ్యం

నారు మడులు సిద్ధం

జంగారెడ్డిగూడెం–1, –2 వేలం పరిధిలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, తదితర మండలాల పరిధిలో ప్రస్తుతం 20 హెక్టార్లలో పొగాకు నారుమడులు రైతులు సిద్ధం చేస్తున్నారు. వీటిలో కమర్షియల్ నారుమడులు 14 హెక్టార్లు, ఆరు హెక్టార్లలో రైతులు సొంతంగా నారుమడులు పెంచుతున్నారు. వీరికి ఎల్‌వీ7, 1353 వంటి వంగడాలను ఎక్కువగా రైతులు నాటుతున్నారు. పెద్ద రైతులు ట్రేలో నారులు పెంచి పంటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

అనుమతులు తప్పనిసరి

వర్జీనియా పొగాకు నారుమడుల నర్సరీలు కట్టాలంటే తప్పనిసరిగా బోర్డు అధికారుల అనుమతి పొందాలి. నారుమడుల రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి బోర్డు ద్వారాగా రసీదు పుస్తకాలను కూడా అందిస్తారు. నర్సరీల పెంపకంలో కూడా ముగ్గురు అధికారులతో విజిలెన్స్ అధికారులను కూడా నియమించి వారి పర్యవేక్షణలో పొగాకు నారుమడులు పెంచే విధంగా చర్యలు తీసుకుంటారు.

నమోదైన వారికే విత్తనాలు



నారుమడులు కట్టే రైతులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. వారి వివరాలను నమోదు చేసుకోవాలి. వేలం కేంద్రంలో నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే సీటీఆర్ఐ ద్వారా ఒక హెక్టారుకు మూడున్నర కిలోలు మాత్రమే విత్తనాలు సరఫరా చేయాలని బోర్డు నిర్ణయించింది.

– బి.శ్రీహరి, వేలం సూపరింటెండెంట్, జంగారెడ్డిగూడెం–1

మాజీ సీఎం జగన్‌ను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్


మాజీ సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న లక్ష్మి

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అధినేతకు పుష్పగుచ్ఛం అందజేశారు. లక్ష్మి వెంట నాయకులు బత్తిన చిన్న, దుర్గా ప్రసాద్, వరుణ్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు

జంగారెడ్డిగూడెం: జిల్లాలో అవినీతికి తావు లేకుండా ఆస్తుల రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్టు జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించి, కక్షిదారులతో మాట్లాడారు. రిజిస్ట్రేషన్లు, ఈసీ, స్టాంప్స్ తదితర అవసరాలపై ఆరా తీశారు. ఈ కార్యాలయంపై ఆరోపణలు ఉంటే పరిశీలిస్తామని శ్రీనివాసరావు చెప్పారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ ఎం భూషణం, సీనియర్ అసిస్టెంట్ పి.భవానీ శంకర్ పాల్గొన్నారు.

'ఆదికర్మ యోగి'తో ప్రయోజనం

బుట్టాయగూడెం: ఆదికర్మ యోగి పథకంతో ఆదివాసీలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కె.రాములు నాయక్ తెలిపారు. కోయరాజమండ్రిలో ఆదికర్మ యోగి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ పథకం ఉద్దేశాన్ని పీఓ వివరించారు. మోటాపీఓ రిషబ్ చతుర్వేది, ప్రత్యేక అధికారి టి.లత, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఈఎస్ఎస్ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ రవ్వా చంద్రకళ, నాగేశ్వరరావు పాల్గొన్నారు. నాగన్నగూడెంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్ దుర్గమ్మ పాల్గొన్నారు.

గో సంరక్షణశాలకు దాణా విరాళం


మినీ లారీలో తీసుకొచ్చిన దాణా బస్తాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి గోసంరక్షణశాలకు విజయవాడకు చెందిన నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు గురువారం 11 టన్నుల దాణాను విరాళంగా అందజేశారు. మినీ లారీలో తీసుకొచ్చిన దాణాను గోసంరక్షణ శాలలో ఉన్న అధికారులకు అందించారు. దాతను వారు ప్రత్యేకంగా అభినందించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతలపూడి: సీతానగరం సబ్‌స్టేషన్ పరిధిలోని ఊటసముద్రం ఏజీఎల్ ఫీడర్‌లో శుక్రవారం ఉదయం 9 నుంచి 4 గంటల వరకు, శంఖుచక్రపురం సబ్‌స్టేషన్ పరిధిలోని సత్యసాయి ఫీడర్, ప్రగడవరం ఏజీఎల్ ఫీడర్, తిమ్మిరెడ్డిపల్లి ఫీడర్లకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆర్‌వీఎస్ఎస్ వర్క్స్ నిమిత్తం ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. వినియోగదారులందరూ సహకరించాలని ఆయన కోరారు.

దత్తాత్రేయునికి పూజలు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం అయ్యప్ప స్వామి ఆలయంలో దత్తాత్రేయునికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

స్వాములకు ఆహ్వానం

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెం శ్రీహరి హరసుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో దసరా మహోత్సవాల సందర్భంగా మాలధరించే స్వాములు, భవానీలకు దసరా రోజు నుంచి మహా అన్న సమారాధన ఏర్పాటుచేయనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. గురువారం ఆలయంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ భక్తులు, స్వాములు అందరూ స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు ప్రెసిడెంట్ చిన్ని వాసు స్వామి, సెక్రటరీ గంగు జగన్ మోహన్ రెడ్డి, కోశాధికారి కూన పార్వతి, రొక్కం కృష్ణారావు, బాకీ శ్రీనివాసరెడ్డి, తానంకి వీరభద్ర రావు, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనంతో ఆత్మ సంతృప్తి


బాలాజీ

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయాన్ని సందర్శిస్తే ఆత్మ తృప్తి, ఆత్మ ధైర్యం కలగడంతో పాటు, చేసే పనిపై పట్టుదల పెరుగుతుందని సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్, బుల్లితెర నటుడు బాలాజీ అన్నారు. ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. సప్తగోకులంలోని గోవులకు దాణా అందించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


బియ్యం, వాహనంతో అధికారులు

జంగారెడ్డిగూడెం: పంగిడిగూడెంలో గురువారం సివిల్ సప్లయిస్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. 14 బస్తాల పీడీఎస్ బియ్యం వాహనంలో తరలిస్తుండగా పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. వాహన యజమాని చోడిశెట్టి సతీష్‌పై 6ఎ, 7(1) కేసు నమోదుచేసి జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సివిల్ సప్లయిస్ డీటీ జి.వెంకటేశ్వరరావు వెల్లడించారు. దాడుల్లో సివిల్ సప్లయిస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కలరాయగూడెం సర్పంచ్‌కు మాతృ వియోగం


నివాళులర్పిస్తున్న అబ్బయ్య చౌదరి, విజయరాజు

లింగపాలెం: కలరాయనగూడెం గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చలగొళ్ల రవిబాబు మాతృమూర్తి శ్యామల (73) గుండెపోటుతో మృతిచెందారు. గురువారం కలరాయనగూడెంలో శ్యామల మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు, లింగపాలెం మండల అధ్యక్షులు అన్నపనేని శాంతారావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

చిన్న అచ్చిరెడ్డికి నివాళి


నివాళులర్పిస్తున్న విజయరాజు

లింగపాలెం: వైఎస్సార్‌సీపీకి చెందిన ముల్లంగి చిన్న అచ్చిరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు, నాయకులు పరామర్శించారు. అచ్చిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విజయరాజు వెంట పార్టీ మండలాధ్యక్షులు అన్నపనేని శాంతారావు, నాయకులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

7న ఫ్యాప్టో ధర్నా

చింతలపూడి : ఫ్యాప్టో ఆధ్వర్యంలో అక్టోబర్ 7న విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ 1938 జిల్లా గౌరవ అధ్యక్షుడు గంధం రాంబాబు అన్నారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయం వద్ద గురువారం ఏపీటీఎఫ్ 1938 జిల్లా అధ్యక్షులు రామ్మోహన్ అధ్యక్షతన జిల్లా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఫ్యాప్టో చైర్మన్ జి.మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు చేయాలని, 12వ పీఆర్సీని ఏర్పాటు చేసి తక్షణమే ఐఆర్ 30 శాతం ప్రకటించాలని, పెండింగ్ డీఏలను రిలీజ్ చేయాలని కోరారు. అసోసియేట్ ఉపాధ్యక్షుడు ఆర్‌డీవీ ప్రసాద్ మాట్లాడారు. సమావేశంలో జె.శ్రీను, జి.అప్పారావు, సీహెచ్ రవీంద్ర, బి.నాగరాజు నాయక్, బి.రామస్వామి, జె.శివ, ఎం రమేష్ బాబు, బి.రామదాసు పాల్గొన్నారు.

చలో మెడికల్ కాలేజీ పోస్టర్ విడుదల

కామవరపుకోట: ఏలూరు నగరంలో 19న శుక్రవారం నిర్వహించే చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉభయగోదావరి జిల్లాల ఇన్‌చార్జి మోహన్, వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు పిలుపునిచ్చారు. గురువారం ఏలూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ మండల నాయకులతో కలిసి వారు చలో మెడికల్ కాలేజీ పోస్టర్ విడుదల చేశారు. యువత, విద్యార్థి విభాగాలు పాల్గొని విజయవంతం చేయాలని విజయరాజు కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజ, ఎంపీటీసీలు బి.సత్యనారాయణ, పి.ప్రశాంత్, మేడంకి పద్మావతి, కోఆప్షన్ సభ్యులు కరిముల్లా, వీరిశెట్టిగూడెం సర్పంచ్ దేవరపల్లి రామ్మోహన్‌రావు, తడికలపూడి సొసైటీ మాజీ చైర్మన్ గుర్రాల రవికుమార్, ఏలూరు జిల్లా యువజన విభాగ ప్రధాన కార్యదర్శి కొమ్మిన నరేష్, కామవరపుకోట టౌన్ ప్రెసిడెంట్ నానాది సాగర్, తదితరులు పాల్గొన్నారు.


చలో మెడికల్ కాలేజీ పోస్టర్‌ను విడుదల చేసిన విజయరాజు, నాయకులు

19న 'చలో మెడికల్ కాలేజీ'

లింగపాలెం: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ ఈనెల 19న శుక్రవారం విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో చలో మెడికల్ కాలేజీ పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ లింగపాలెం మండల యూత్ అధ్యక్షులు చీదరాల ప్రసాద్ నిర్వహిస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నేడు, రేపు లేఖర్ల పెన్ డౌన్

పోలవరం రూరల్: దస్తావేజు లేఖర్ల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 19, 20 తేదీల్లో పెన్ డౌన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పోలవరం మండల దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం సభ్యులు తెలిపారు. ఈ మేరకు పోలవరం సబ్ రిజిస్ట్రార్ జె.రత్నకుమార్‌కు గురువారం వారు నిరసన కార్యక్రమ పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోటీపీ విధానం వల్ల ప్రజలు రిజిస్ట్రేషన్ చేయించుకోవటానికి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, డేటా ఎంట్రీలో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం పిలుపు మేరకు పెన్ డౌన్ కార్యక్రమాన్ని రెండు రోజులు నిర్వహిస్తున్నామని, దీనికి రిజిస్ట్రేషన్ చేయించుకునేవారు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో లేఖర్లు సారిక శివకుమార్, పెంజర్ల వెంకటరామారావు, రాకుర్తి హరినాధరావు, సారిక అప్పారావు, పెరుమాళ్ల గోవిందరావు పాల్గొన్నారు.


సబ్‌రిజిస్ట్రార్‌కు నిరసన పత్రం అందిస్తున్న లేఖర్లు

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్న 'కూటమి'

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తోందని సీపీఐఎంఎల్ ప్రజా పోరాట సమితి నాయకులు అన్నారు. మండలంలోని వేగవరంలో సమితి సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా ఎటువంటి అభివృద్ధి కానరావడం లేదన్నారు. ప్రభుత్వం ఎన్నో అక్రమాలు జరిగాయని, ప్రశ్నించే వారిని కొట్టడం, కేసులు పెట్టడం, కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటీకరణ దిశగా సాగుతూ ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారు. పథకాలు అందిస్తూ ప్రజలను సోమరిపోతుల్లా మార్చుతున్నారని, వీటిని మానుకుని కనీస అవసరాలైన విద్య, వైద్యం ఉచితం చేసి, యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో పెట్టనున్న ఆయుధ కర్మాగారాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. పాలన ఇలాగే కొనసాగితే కూటమి ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమాలు, ధర్నాలు, బందులు, రాస్తారోకోలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలింపూడి సుందర్‌రావు, జిల్లా నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆశించిన స్థాయిలో లేని ప్రసవాలు

కామవరపుకోట: ప్రసవాలన్నీ ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరిగేలా కృషిచేయాలని జిల్లా వైద్య శాఖ అధికారి అమృత జాన్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను, ఇమినేషన్, ల్యాబ్ విభాగాలను పరిశీలించారు. ఆశించిన స్థాయిలో ఆసుపత్రిలో ప్రసవాలు అవ్వకపోవడంపై సిబ్బందిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణం శుభ్రంగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. సిజేరియన్ పసవాలకు అడ్డుకట్ట వేసి సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలని ఆమె సిబ్బందికి సూచించారు. మాతృ, శిశు మరణాల సంభవించకుండా ముందు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఆమె వెంట డాక్టర్ రోహిత్, సీసీబీ బసవరాజు ఉన్నారు.


ఆసుపత్రిలో రోగులను వివరాలను అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ అమృత జాన్

రాష్ట్రస్థాయి పోటీలకు యడవల్లి విద్యార్థులు

కామవరపుకోట: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఈస్ట్ యడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు ఎంఎల్ కోటేశ్వరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న ఏలూరు ఎస్ఆర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ హైజంప్ పోటీలు అండర్–16 విభాగంలో జె.రోహిత్ దుర్గా ప్రసాద్, ఎంజై సూర్య, అండర్–18 విభాగంలో కె.జస్వంత్, కె.తిలక్ కిషోర్, షాట్ పుట్ జావిలిన్ త్రోలో పి.నందిబాబు విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికై నట్టు వివరించారు. వీరు ఈనెల 27, 28, 29 తేదీల్లో ఏలూరు ఎస్ఆర్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు జి.రవిని. విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.


అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

స్విమ్మింగ్ పోటీలకు పుట్లగట్లగూడెం విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ స్విమ్మింగ్ పోటీలకు పుట్లగట్లగూడెం హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం యు.చంద్రశేఖర్ తెలిపారు. వీరిని గురువారం పాఠశాలలో అభినందించారు. ఈ నెల 16న ఏలూరులో జరిగిన అండర్–14, –17 బాలుర విభాగంలో ఫ్రీస్టయిల్, రిలే విభాగాల్లో కె.అఖిల్ (8వ తరగతి), డి.జయవాసు (8వ తరగతి)లు జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ఐ స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరు త్వరలో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను ఎస్ఎంసీ చైర్మన్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, పీడీ ప్రసాద్ అభినందించారు.



స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన కె.అఖిల్, డి.జయవాసు

మహిళలకు వైద్య శిబిరాలు

కొయ్యలగూడెం: స్వస్థ్ నారీ, స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో మండలంలోని రాజవరం, గంగవరంలో మహిళలకు గురువారం బయ్యనగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఏలేటి తుక్కయ్య, వైద్యధికారి వి.సత్యనారాయణ, ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్ సుబ్రహ్మణ్యం మాట్లాడారు. జీవన శైలిలో పాటించాల్సిన ఆహారపు అలవాట్లపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వి.రాధాకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్లు బాషా, మరియమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యం, పోషకారంపై అవగాహన

జంగారెడ్డిగూడెం : మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో స్వస్థ్ నారీ, స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బొర్రంపాలెం పీహెచ్‌సీ డాక్టర్ హర్ష నేతృత్వంలో వైద్య సిబ్బంది మహిళల ఆరోగ్యం, పోషకాహారం, కుటుంబ సంక్షేమంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ గుబ్బల సత్యవేణి, ఎంపీటీసీ కొయ్యా రమారెడ్డి, నాయకులు ఉండవల్లి చంద్రరావు, బుసా సత్యనారాయణ, వైద్యసిబ్బంది కె.ఏడుకొండలు, కృష్ణవేణి, శివ, ఎం.జ్యోతి, కె.జ్యోతి, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంఘం విచ్ఛిన్నం తగదు

టి.నరసాపురం: బొర్రంపాలెం ముత్యాలమ్మ మత్స్య సహకార సంఘాన్ని విచ్ఛిన్నం చేయాలనుకోవడం తగదని మత్స్యకారులు అన్నారు. బొర్రంపాలెం ఎర్రకాలువ జలాశయం వద్ద ముత్యాలమ్మ మత్స్యకార సహకార సంఘం సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు గుండె ధనరాజు, గుండె చిన చిట్టియ్య, బత్తుల రమేష్ తదితరులు మాట్లాడుతూ టీడీపీ నాయకులు శీలం వెంకటేశ్వరరావు, గండబోయిన శ్రీనులు మరో సంఘం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రెండో సంఘం ఏర్పాటుకు అంగీకరించబోమన్నారు. ఒక దశలో ఇద్దరు సభ్యులు తమకు చావే శరణ్యమంటూ ఒంటిపై డీజిల్‌పోసుకుని ఆందోళన వ్యక్తం చేశారు. వారిని తోటి సభ్యులు వారించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమానికి సామాజికవేత్త గుండె పాండురంగ ఆధ్వర్యం వహించారు.


ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ

కొయ్యలగూడెం: హెల్మెట్ ధారణతో ప్రమాదాల నుంచి 50 శాతం ప్రాణ రక్షణ ఉంటుందని ఎస్సై వి.చంద్రశేఖర్ అన్నారు. స్థానిక తేజ హోండా షోరూమ్‌లో నూతనంగా లాంచ్ చేసిన హోండా షైన్ 100 డీలక్స్ (100సీసీ) బైకును ఆయన ప్రారంభించారు. బైక్ కొనుగోలు చేసిన కస్టమర్‌కి పోలీసు శాఖ తరఫున హెల్మెట్‌ను బహూకరించారు. బైక్ నూతన ఫీచర్స్‌ను ప్రొప్రైటర్ ఉద్దండం హర్ష వెల్లడించారు.


బైక్‌తో పాటు హెల్మెట్‌ను అందిస్తున్న ఎస్సై

సంక్షిప్తంగా..

నేడు మండల పరిషత్ సమావేశం

లింగపాలెం: లింగపాలెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు లింగపాలెం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ముసునూరు వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.వాణి తెలిపారు. ప్రజాప్రతినిధులు అధికారులు విధిగా హాజరు కావాలని ఆమె కోరారు.

బ్లడ్ గ్రూపింగ్, డెంటల్ క్యాంప్

జంగారెడ్డిగూడెం: రెడ్ రిబ్బన్ క్లబ్, జువాలజీ శాఖల ఆధ్వర్యంలో బ్లడ్ గ్రూపింగ్, డెంటల్ క్యాంపు శుక్రవారం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాద్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు వైద్య సేవలు అందించారు. ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ రాంబాబు ఆర్ఎంవో మాట్లాడుతూ బ్లడ్ గ్రూపింగ్‌పై అవగాహన ఉంటే, రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, డాక్టర్లు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

కొయ్యలగూడెం: పరింపూడి పంచాయతీ పరిధిలోని రోడ్ల ఆక్రమణలు తొలగించాలని మానవత సంస్థ సభ్యుడు నిడదవోలు రామారావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. జంగారెడ్డిగూడెం రోడ్డులోని పంచాయతీ కార్యాలయ స్థలాన్నే ఆక్రమించి కడితే స్పందించేవారు లేరని వివరించారు. దీనిపై స్పందనలో ఫిర్యాదులు చేసినా ఫలితంలేదని తెలిపారు. శ్రీరామ్ నగర్, వడ్డీల పేట, ముస్లింల పేటలో ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అగ్నిప్రమాదం

కొయ్యలగూడెం: గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న షేక్ రహీంకి చెందిన వాటర్ సర్వీసింగ్ సెంటర్లో గురువారం షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించిందని జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రం అధికారి అబ్రహాం తెలిపారు. ఎలక్ట్రికల్ సామాన్లు దగ్ధమయ్యాయని, వీటి విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజా ఉద్యమ దిక్సూచి సురవరం

జంగారెడ్డిగూడెం: 65 ఏళ్ల ప్రజా జీవితంలో ఎన్నో ఉద్యమాలకు నేతృత్వం వహించి చారిత్రక ఉద్యమ విజయాలను చవిచూసిన సురవరం సుధాకర్ రెడ్డి ప్రజా ఉద్యమ దిక్సూచి అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనిజ తెలిపారు. సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ గురువారం స్థానిక ఎంటీ సోషల్ క్లబ్‌లో నిర్వహించారు.

శ్రీవారికి పవిత్రాల సమర్పణ

జంగారెడ్డిగూడెం: పవిత్ర ఉత్సవాల్లో భాగంగా గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న గురువారం విశ్వక్సేన పూజ పుణ్యాహవాచనం అనంతరం యాగశాలలో కుంభ ఆరాధన నిత్య హోమములు నిర్వహించారు. ఆలయంలోని సమస్త దేవత మూర్తులకు, ధ్వజస్తంభమునకు పవిత్ర మాలలతో అలంకరణ చేశారు.

ప్రకటన

[illegible] ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్లు అయిన 1. [illegible] W/o [illegible] జంగారెడ్డిగూడెం 2. గుడిమెట్ల సోమేశ్వరరావు S/O [illegible] [illegible] సర్వే నంబర్లలో భూమి కలదు. కానీ ఈ ఆస్తికి సంబంధం లేని కొందరు వ్యక్తులు ఏ విధమైన హక్కులు లేకుండా [illegible] రిజిస్ట్రేషన్లు చేయుటకు ప్రయత్నం చేయుచున్నారు. కావున [illegible] ఈ ఆస్తికి సంబంధించి ఏవిధమైన [illegible] మరియు [illegible] లావాదేవీలు జరిపినా, [illegible] లావాదేవీలు జరిపిన యెడల నా క్లయింట్లు తీసుకునే క్రిమినల్ మరియు సివిల్ చర్యలకు బాధ్యులు అగుదురు.

భూమి వివరములు :

సర్వే నెంబరు	భూమి	గ్రామము
268	7.60 సెంట్లు	జంగారెడ్డిగూడెం
342	8.08 సెంట్లు	జంగారెడ్డిగూడెం
344	11.06 సెంట్లు	జంగారెడ్డిగూడెం
249	7.00 సెంట్లు	జంగారెడ్డిగూడెం
60/1	10.82 సెంట్లు	గుర్వాయిగూడెం
60/2	1.53 సెంట్లు	గుర్వాయిగూడెం

ఇట్లు.
పి.ఆర్.కె.అమరేంద్ర కుమార్,M.A.,B.L.,D.P.A
అడ్వకేట్, [illegible]
[illegible]
సెల్ [illegible]

[illegible]
ది.18.09.2025